సంపుటి :02 సంచిక :180 పేజీలు :05

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

మంగళవారం 09, సెప్టెంబర్ 2025

# భవిష్యత్తులో మీరేం అవుతారు

- విద్యార్థులను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్
- గిర్మాజీపేట ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

వివరాలు 5వ పేజీలో..



## మావోయిస్టు పార్టీ చీఫ్ గా తిప్పరి తిరుపతి

- తెలంగాణ నుంచి పార్టీ చీఫ్ గా ఎదిగిన మూడో నేతగా గుర్తింపు
- గతంలో గణపతి, బసవరాజు సేవలు





## రోడ్ల పక్కన ఆ విగ్రహాల అమ్మకాలు నిషేధం

- బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్
- రంగలీలా మైదానం, హయగ్రీవచారి గ్రౌండ్ లో అమ్మకాలు జరపాలని ఆదేశం

2లో..

## ఏసీబీకి చిక్కిన ప్లానింగ్ ఆఫీసర్

- ఎల్ఆర్ ఎస్ క్లియరెన్స్ కు రూ.10 లక్షలు డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు



2లో..

# డీసీసీ కాంగిరేసు

- వారం రోజుల్లో జిల్లాస్థాయి పార్టీ కమిటీలు
- పీసీసీ సమావేశంలో నిర్ణయించిన పార్టీ పెద్దలు
- వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఆశావహులు
- జిల్లా పార్టీ సారథి పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు
- పీసీసీ చీఫ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో ఎంపిక

జిల్లాల స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్నది. దీనిలో భాగంగానే వారం రోజుల్లో డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లను నియమించనున్నది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన పీసీసీ సమావేశంలో పార్టీ పెద్దలు నిర్ణయించారు. దీంతో జిల్లాల్లో ఎవరెవరికి పదవులు దక్కుతాయనే చర్చ జోరుగా జరుగుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతోమంది ఆశావహులు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. డీసీసీ అధ్యక్ష పదవులు దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. పార్టీ పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో ఎంపికలు జరుగనున్నాయి.

— అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



## గ్రామాల్లో గుప్పుమంటున్న గుడుంబా

03

- గుట్టుచప్పుడు కాకుండా తయారీ
- మద్యానికి బదులు సారా తాగుతున్న పేదలు
- దృష్టి సారించని ఎక్సైజ్ శాఖ
- మత్తులో తూగుతున్న పల్లెలు

కేసముద్రం మండల వ్యాప్తంగా పల్లెల్లో, మారుమూల తండాల్లో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్నా నాటుసారా తయారీ మళ్లీ పుంజుకుంది. గుడుంబా తయారీ దారులు గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు. మద్యం ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు నాటుసారా వైపు మల్లుతున్నారు. గుడుంబాను నిరోధించాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మూలాలపై దృష్టి పెట్టకుండా అడపాదడపా దాడులు చేస్తూ అమ్మకందారులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో గుడుంబా తయారు చేసేవాళ్లకు గత ప్రభుత్వం ఉపాధిని కల్పించింది. అయినప్పటికీ కొందరు గుడుంబా కాయడమే వృత్తిగా పెట్టుకుని పల్లెల్లో, తండాల్లో జోరుగా దందాను సాగిస్తున్నారు. గుడుంబా కేవలం పల్లెలు, తండాలకే పరిమితం కాకుండా ఇప్పుడు పట్టణాలకు సైతం పాకింది. గతంలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు

—అక్షర దర్బార్, కేసముద్రం

# ఏసీబీకి చిక్కిన ప్లానింగ్ ఆఫీసర్

- ఎల్ఆర్ ఎస్ క్లియరెన్స్ కు రూ.10 లక్షలు డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

అక్షరదర్బార్, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నార్సింగి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి మణిహారిక అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. మంచిరేవులలో ప్లాట్ ఎల్ఆర్ఎస్ క్లియరెన్స్ కు రూ.10 లక్షలు ఇవ్వాలని వినోద్ అనే వ్యక్తిని ఆమె డిమాండ్ చేసింది. ముందుగా రూ.4 లక్షలు ఇవ్వాలని కోరింది. దీంతో బాధితుడు అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ)ను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ పక్కా ప్లాన్‌తో మంగళవారం బాధితుడి నుంచి ఆమె రూ.4 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్నది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు గతంలో జారీ చేసిన అనుమతులకు సంబంధించిన ఫైళ్లను అధికారులు తనిఖీ చేస్తున్నారు.

# రోడ్ల పక్కన ఆ విగ్రహాల అమ్మకాలు నిషేధం

- బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్
- రంగలీలా మైదానం, హయగ్రీవచారి గ్రౌండ్ లో అమ్మకాలు జరపాలని ఆదేశం

అక్షరదర్బార్, వరంగల్: రోడ్ల పక్కన దేవత మూర్తుల విగ్రహాల అమ్మకాలు నిషిద్ధం అని బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు బల్దియా పరిధిలో రోడ్ల పక్కన దేవత మూర్తుల విగ్రహాలు అమ్మడం నిషేధం అని, ఇందువల్ల ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా ప్రజలు వాహన దారులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని అరికట్టడానికి బల్దియా పరిధి వరంగల్ నగరానికి సంబంధించి ఉర్సు రంగలీల మైదానం, హన్మకొండ పరిధి లో హయగ్రీవ చారి గ్రౌండ్( కాళోజీ కళాక్షేత్రం ప్రక్క మైదానం) ప్రాంతాల్లో అమ్మకాలు జరుపుకోవాలని ఆయన పేర్కొన్నారు. విగ్రహాలు విక్రయించే వ్యాపారస్థులు ఖచ్చితంగా ఆయా ప్రాంతాల్లో మాత్రమే అమ్మకాలు జరపాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని, నిబంధనలు ఉల్లంఘించి రోడ్ల పక్కన విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని, ఈ నేపథ్యంలో విగ్రహ విక్రయదారులు సూచించిన ప్రాంతాల్లో విగ్రహాలు అమ్మకాలు జరుపుకుంటూ బల్దియాకు సహకరించాలని అదనపు కమిషనర్ కోరారు.



అక్షర దర్బార్ Voice of the people



# డీసీసీ కాంగిరేసు

- వారం రోజుల్లో జిల్లాస్థాయి పార్టీ కమిటీలు
- పీసీసీ సమావేశంలో నిర్ణయించిన పార్టీ పెద్దలు
- వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఆశావహులు
- జిల్లా పార్టీ సారథి పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు
- పీసీసీ చీఫ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో ఎంపిక

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : జిల్లాల స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్నది. దీనిలో భాగంగానే వారం రోజుల్లో డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లను నియమించనున్నది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన పీసీసీ సమావేశంలో పార్టీ పెద్దలు నిర్ణయించారు. దీంతో జిల్లాల్లో ఎవరెవరికి పదవులు దక్కుతాయనే చర్చ జోరుగా జరుగుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతోమంది ఆశావహులు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. డీసీసీ అధ్యక్ష పదవులు దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. పార్టీ పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో ఎంపికలు జరుగనున్నాయి.

### - హనుమకొండ జిల్లాల నుంచి..

హనుమకొండ జిల్లాకు ప్రస్తుతం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయినీ రాజేందర్‌రెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష రేసులో దొమ్మాటి సాంబయ్య, పింగిలి వెంకటరెడ్డి, ఇనగాల వెంకటరెడ్డి, గొట్టిముక్కుల రమాకాంత్ రెడ్డి, రవీందర్ యాదవ్, తోట వెంకటేశ్వర్లు తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిలో దొమ్మాటి సాంబయ్య ఎంపీ టిక్కెట్ ఆశించి నిరాశ చెందారు. అలాగే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవినీ ఆశించారు. కానీ, ఏ పదవీ ఆయనకు దక్కలేదు. ఒకవేళ పార్టీ ఎస్సీ వర్గానికి చెందిన నేతకు డీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టాలని నిర్ణయిస్తే, ఆ పదవి కచ్చితంగా దొమ్మాటి సాంబయ్యకే దక్కుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

### - వరంగల్ జిల్లా నుంచి..

వరంగల్ జిల్లాకు ప్రస్తుతం ఎర్రబెల్లి స్వర్ణ డీసీసీ అధ్యక్షుర ాలిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష రేసులో స్వర్ణతో పాటు నెక్కొండకు చెందిన ఎస్ రంజిత్‌రెడ్డి, మరోనేత బొంపెల్లి దేవేందర్‌రావు పేర్లు ప్రముఖంగా వనిపిస్తున్నాయి. ఇదే జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొండా సురేఖ కూడా తమ అనుచరుల్లో ఒకరిని డీసీసీ అధ్యక్ష పదవికి ప్రతిపాదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ నేత ఎవరనేది ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది.

### - భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి..

భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడిగా ప్రస్తుతం ఐత ప్రకాశ్‌రెడ్డి కొనసాగుతున్నారు. డీసీసీ అధ్ ుక్ష రేసులో ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. అలాగే గాజర్ల అశోక్, చల్లూరి మధు పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వీరిలో ఐత ప్రకాశ్ రెడ్డికి మంత్రి శ్రీధర్‌బాబు అనుచరుడిగా పేరున్నది. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి చెందిన నేతగా ప్రకాశ్‌రెడ్డి కొనసాగుతున్నారు. కాబట్టి మంత్రి ప్రకాశ్‌రెడ్డి పేరునే ప్రతిపాదించే అవకాశం ఉంది. అయితే.. ప్రకాశ్‌రెడ్డి ప్రస్తుతం ఓ కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆ కోణంలో ఆలోచించి పార్టీ పక్కన పెడితే, డీసీసీ అధ్యక్ష పదవి మిగతా ఇద్దరైన గాజర్ల అశోక్, చల్లూరు మధు పేర్లను పరిశీలించే అవకాశం ఉంది. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా ప్రస్తుతం అశోక్ కొనసాగుతున్నారు. అధిష్ఠానం ఇకపై కూడా ఆయన్నే అధ్యక్షుడి గా కొనసాగిస్తుందనే చర్చ నడుస్తున్నది.

### - ఇక ఆపరేషన్ ఆకర్ష్..

**వివిధ కారణాలతో పార్టీని వీడి బయటకు వెళ్లిన వారిని తిరిగి పార్టీలోకి చేర్చుకోవడంతో పాటు ఇతర పార్టీల నుంచీ కాంగ్రెస్‌లో చేరికలకు తాజాగా టీపీసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆపరేషన్ ఆకర్ష్ ను పార్టీ అమలుచేయనున్నది. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ సమావేశంలో పార్టీ పెద్దలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 15న కామారెడ్డిలో లక్ష మందితో భారీ సభ నిర్వహించాలని పీసీసీ నిర్ణయించింది. కాంగ్రెస్ పదవుల పంపకాల్లో సామాజిక న్యాయం పాటించాలని, వారం రోజుల్లో జిల్లాల్లో డీసీసీ నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించింది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. మావేశంలో పార్టీలో అంతర్గత సమీకరణాల సమతుల్యం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టే అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, ఓట్ చోరీకి సంబంధించిన అంశాలపైనా కొంత చర్చ జరిగింది. ఈ నెల 15న కామారెడ్డిలో లక్ష మందితో కాంగ్రెస్ సభ నిర్వహించాలని, అందుకు జనసమీకరణ చేయాని పీసీసీ చీఫ్ పిలుపునిచ్చారు. పార్టీలో చేరికల విషయంలో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలనే నిర్ణయానికి వచ్చారు. పార్టీ కేడర్‌ను.. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారు ఒక వర్గంగా, ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారిని రెండో వర్గంగా, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్‌లో చేరిన వారిని మూడోవర్గం చేయాలని నిర్ణయించారు. వర్గాల ఆధారంగా పదేళ్లుగా పార్టీలో ఉంటున్న వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టాలనే నిర్ణయానికి వచ్చారు.**

### - జిల్లాల్లో విస్తృతస్థాయి సమావేశాలు

ఇకపై జిల్లాల్లోనూ పార్టీ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ సూచించారు. ప్రతి కమిటీలో సామాజిక న్యాయానికి కట్టుబడి పదవులు అప్పగిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం ఉంటుందని భరోసానిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో 70 80 శాతం పదవులు పాతవారికే ఇచ్చామని, మిగిలిన 20 శాతం కొత్తవారికి అవకాశం కల్పిస్తామని తేల్చిచెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని పార్టీ యోచిస్తుందని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌కి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. 15న జరిగే కామారెడ్డి సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రతిష్ఠాత్మకమని, ఆ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. వచ్చే వారంలో డీసీసీ కమిటీల నియామకాలు పూర్తి చేస్తామన్నారు. మూడు నెలల్లో పార్టీ గ్రామ అధ్యక్షులు ఎంపిక ఉంటుందన్నారు.

# ఠాణాలను సందర్శించిన సీపీ

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం వరంగల్ మట్టెవాడ, ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. ఆయా స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ ని సిబ్బంది మొక్క అందజేసి సాదరంగా ఆహ్వానించారు. తరువాత కమిషనర్ స్టేషన్ల పరిసరాలను పరిశీలించి శుభ్రత, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధి నిర్వహణపై సమీక్ష జరిపారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరు, కేసుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయా స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, స్థానిక కాలనీల పరిస్థితులు, రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీల జాబితా తదితర అంశాలపై ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, షుకూర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిబ్బంది ప్రజలతో మరింత సమన్వయంతో వ్యవహరించి, సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సీపీతో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏఎస్పీ శుభమ్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు పార్టీ చీఫ్ గా తిరుపతి

- తెలంగాణ నుంచి పార్టీ చీఫ్ గా ఎదిగిన మూడో నేతగా గుర్తింపు
- గతంలో గణపతి, బసవరాజు సేవలు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ నియమితుడయ్యాడు. గత చీఫ్ నంబాల కేశవరావు మరణంతో కేంద్ర కార్యదర్శి పదవి ఖాళీగా ఉంది. దీంతో ఎవరు పార్టీ చీఫ్ కమాండర్ అవుతారనే చర్చ జాతీయ స్థాయిలో జరిగింది. చివరకి పార్టీ పొలిట్‌బ్యూరో తిరుపతి ని పార్టీ చీఫ్‌గా ఎంపిక చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన తిరుపతి 1983లో పార్టీలో చేరాడు. దళ సభ్యుడి నుంచి కేంద్ర కార్యదర్శి వరకు అంచెలంచెలుగా ఎదిగాడు. ప్రస్తుతం తిరుపతి కేంద్ర కమిటీ సభ్యుడిగా, మిలీషియా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. తిరుపతిని పట్టిస్తే రూ.కోటి ఇస్తామని ఇప్పటికే కేంద్ర హోంశాఖ ప్రకటించింది. 2010లో జరిగిన దంతెవాడ జవాన్లపై దాడి ఘటనకు తిరుపతి ప్రాతినిధ్యం వహించాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకు తెలంగాణకు చెందిన గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు, బసవరాజు అలియాస్ నంబాల కేశవరావు పార్టీ చీఫ్ కమాండర్‌గా పని చేశారు. తాజాగా పార్టీ చీఫ్‌గా ఎంపికైన తిరుపతి కూడా తెలంగాణకు చెందిన వ్యక్తే..

# కాళోజీ సేవలు చిరస్మరణీయం..

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణ రావు 111వ జయంతి వేడుకలను ఎంపీడీఓ గజ్జెల విముల ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ విద్యావతి, టి ఏ స్వప్న, కార్యాలయ సిబ్బంది గోవిందు నవీన్ కుమార్,దర్శన్, రాజేందర్, నడికూడ ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, అంగన్వాడీ టీచర్ కళావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## బాలాజీ టెక్నోస్కూల్లో ..

అక్షర దర్బార్, నర్సంపేట : లక్నేపల్లి బాలాజీ టెక్నోస్కూల్లో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో వ్యాసరచన, గేయరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# గ్రామాల్లో గుప్పుమంటున్న

# గుడుంబా

- గుట్టుచప్పుడు కాకుండా తయారీ, అమ్మకాలు
- మద్యానికి బదులు సారా తాగుతున్న పేదలు
- గుడుంబా మూలాలపై దృష్టి సారించని ఎక్సైజ్ శాఖ
- మత్తులో తూగుతున్న పల్లెలు

అక్షర దర్బార్,కేసముద్రం : కేసముద్రం మండల వ్యాప్తంగా పల్లెల్లో, మారుమూల తండాల్లో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్నా నాటుసారా తయారీ మళ్లీ పుంజుకుంది. గుడుంబా తయారీ దారులు గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు. మద్యం ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు నాటుసారా వైపు మల్లుతున్నారు. గుడుంబాను నిరోధించాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మూలాలపై దృష్టిపెట్టకుండా అడపాదడపా దాడులు చేస్తూ అమ్మకందారులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో గుడుంబా తయారు చేసేవాళ్లకు గత ప్రభుత్వం ఉపాధిని కల్పించింది. అయినప్పటికీ కొందరు గుడుంబా కాయడమే వృత్తిగా పెట్టుకుని పల్లెల్లో, తండాల్లో జోరుగా దందాను సాగిస్తున్నారు. గుడుంబా కేవలం పల్లెలు, తండాలకే పరిమితం కాకుండా ఇప్పుడు పట్టణాలకు సైతం పాకింది. గతంలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.

## - జోరుగా నాటుసారా తయారీ..

కేసముద్రం మండలంలో నాటుసారా తయారీ జోరందుకుంది. మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు తక్కువ ధరల్లో లభించే గుడుంబా వైపు మరులుతున్నారు. దీంతో పల్లెలతో పాటు పట్టణాల్లోనూ సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని వివిధ ప్రాంతాల్లో సారా విచ్చలవిడిగా తయారవుతోంది. గుట్టుచప్పుడు కాకుండా ప్లాస్టిక్ కవర్లలో నింపి రవాణా చేస్తున్నారు. భవానీ గడ్డ తండా,మేఘ్య తండా,గిర్నితండా,ఎన్టీఆర్ నగర్ తండా, చప్పిటిగుట్ట తండా,క్యాంపు తాండ,చంద్రు తండా, పీక్లతండా, గోప్యతండా, చెరువు ముందు తండా,కాట్రపల్లి, ఉప్పరపల్లి,వెంకటగిరి,బేరువాడ, ధన్నసరి,నారాయణపురం, గాంధీనగర్,తాళ్లపూసపల్లి,కోరుకొండపల్లి ఇలా మండలంలోని వివిధ గ్రామాల్లో, అటవీ ప్రాంతాల్లో గుడుంబా తయారీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ద్విచక్రవాహనాలపై ఇతర గ్రామాలు, పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు సారా తయారీనే వృత్తిగా మలుచుకొని పెద్దఎత్తున తయారు చేసి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో గుడుంబా తయారీ పెద్దఎత్తున సాగేది. అప్పట్లో గత ప్రభుత్వం తయారీకి అడ్డుకట్ట వేయడానికి బెల్లం తయారీని నిషేధించింది. దీంతో పాటు సారా తయారీకి అలవాటు పడిన కుటుంబాలకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పించారు. అనంతరం వారు సారా త యారీ మానుకునేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఇటీవల కాలంలో తిరిగి సారా గుప్పు మంటోంది. కొందరు తమ కోసం బెల్లంతో మేలి రకం సారా తయారు చేసుకుని తాగుతుండగా మరికొందరు చక్కెర,కుళ్లిన అరటిపండ్లు, ఇతర మత్తు పదార్థాలతో గుడుంబా తయారు చేసి దందా సాగిస్తున్నారు...



## - మందుబాబులు నాటుసారా వైపు..

**మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన కొందరు మత్తు కోసం సారాకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం తాగాలంటే వందల రూపాయలు వెచించాల్సి వస్తోంది. క్వాటర్ మద్యం కోనాలన్నా రూ.200 లకు పైగానే ఖర్చవుతోంది. ఇలాంటి సమయంలో తక్కువ ధరల్లో దొరుకుతున్న గుడుంబా తాగేందుకు మందుబాబులు నాటుసారా వైపు చూస్తున్నారు.గుడుంబాను మండలంలోని వివిధ గ్రామాల్లో డైలీ కూలీ పనులు చేసే వ్యక్తులు ఎక్కువగా తాగుతున్నట్లు తెలుస్తోంది.గుడుంబా అమ్మకాలు గుట్టు చప్పుడు కాకుండా చాప కింద నీరులా పారుతుంది. రోజువారి కూలీ పనులు చేసుకుని బతికేవారు చాలా మంది సారా, గుడుంబా తాగుతున్నట్లు సమాచారం..**

## - గుడుంబాపై ఎక్సైజ్ శాఖ నిఘా కరువు...

మండలంలోని నిషేధిత గుడుంబాపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టలేకపోతుందనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా నాటుసారా తయారు చేసే మూలాలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో విచ్చలవిడిగా నాటుసారా తయారవుతుందనే వాదన వినిపిస్తోంది. సారా అమ్మకాలు ఆగాలంటే తయారీ మూలాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గుట్టుగా తయారీ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో గుడుంబాను పెద్ద ఎత్తున తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో పంట చేన్ల వద్ద గుట్టుగా తయారు చేస్తున్నారు. అయితే అప్పుడప్పుడు ఎక్సైజ్ అధికారులు తండాలపై దాడులు నిర్వహించి సారా అమ్మకాలపై వెతుకుతున్నారు. మూలాలను వెతకకుండా ఎక్కడో ఒకచోట దాడులు నిర్వహిస్తున్నారు. సారా ఎక్కడ తయారు చేస్తున్నారో గుర్తించి పక్కా వ్యూహంతో దాడులు చేస్తే అసలు నిందితులు దొరికే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అధికారుల దాడులు ఉంటాయో లేదో వేచి చూడాల్సిందే మరి..

# స్టేషన్ హై స్కూల్ కు సౌండ్ సిస్టం బహూకరణ

అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం పట్టణ కేంద్రంలోని హై స్కూల్ కు సౌండ్ సిస్టంను మంగళవారం బొట్టు రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా బొట్టు రమేష్ మాట్లాడుతూ... ఇది విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా పాఠశాల కార్యక్రమాలు, సమావేశాలు, ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలలో ఉపయోగపడుతుందని అన్నారు. ఇది పాఠశాల అభివృద్ధికి ఎంతో సహాయపడుతుందని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు అందరూ కలిసి సౌండ్ సిస్టంను బహూకరించినందుకు బొట్టు రమేష్ ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి రాజు, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.



# ఏడీఏ లీవ్ షాక్...

## యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు

## బాధ్యతలు చేపట్టిన వెంటనే ఏడిఏ లీవ్




అక్షర దర్బార్ , పరకాల: ప్రస్తుతం పరకాల వ్యవసాయ మార్కెట్లలో యూరియా కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల అండగా నిలవాల్సిన వ్యవసాయ శాఖ అధికారి ఏడిఏ కొణిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే లీవ్ వెల్లిపోవడం రైతుల్లో తీవ్ర నిరాశను కలిగిస్తోంది. ఈనెల 3వ తేదీన పరకాల ఏడిగా పదవి స్వీకరించిన జగదీశ్వర్ రెడ్డి, 4వ తేదీన ఒక ఫర్టిలైజర్ షాప్ తనిఖీ చేసి, ఆ తరువాత 15 రోజుల పాటు లీవ్ పై వెళ్ళిపోయినట్లు సమాచారం. వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఎరువుల సమస్యలు తలెత్తుతున్న వేళ ఏడిఏ గైర్హాజరు కావడం వెనుక ఏం కారణం అన్నది రైతుల్లో చర్చనీయాంశమైంది."మాకు అవసరమైన సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం విచారకరం. రైతుల సమస్యలు వినటానికి, పరిష్కరించటానికి ఎవరు లేరు. బాధ్యతలు చేపట్టిన వెంటనే లీవ్ వెళ్ళిపోవడం వల్ల మాకు మిగిలింది నిరాశే" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# నకిలీ విత్తనాల వ్యాపారిపై పీడీ యాక్ట్..

- నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలింపు
- ముఠా వద్ద నుండి రూ.63.62 లక్షల విలువైన విత్తనాలు, మందులు స్వాధీనం

అక్షర దర్బార్, పరకాల: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన మెహదీపట్నం ప్రాంతానికి చెందిన ముద్దంగుల ఆదిత్యపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. పరకాల ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ ఉత్తర్వులు జైలులో అందజేసి, నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఆదిత్య మరో ఆరుగురితో కలిసి నకిలీ, గడువు ముగిసిన పురుగు మందులు విక్రయిస్తూ జూన్ 6న అరెస్టయినట్లు పోలీసులు తెలిపారు. ముఠా వద్ద నుండి రూ.63.62 లక్షల విలువైన విత్తనాలు, మందులు స్వాధీనం చేశారు. నిందితుడిపై ఇప్పటికే నాలుగు కేసులు నమోదై ఉన్నాయి. రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లికి బర్త్ డే విషెష్

## శుభాకాంక్షలు తెలిపిన మర్రి నారాయణరావు

అక్షర దర్బార్, కేసముద్రం : ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్రావు జన్మదినం సందర్భంగా మంగళవారం నాడు ఆయన నివాసంలో మాజీ మార్కెట్ చైర్మన్ మర్రి నారాయణరావు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ నేపథ్యంలో మర్రి నారాయణరావు రాజకీయ గురువైన ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్రావు ప్రజలకు మరిన్ని సేవలందించి ఎన్నో ఉన్నత పదవులను చేపట్టాలని కాంక్షించారు. ఆ భగవంతుడు రవీందర్రావుకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఈ సందర్భంగా ఆయన వేడుకున్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం

అక్షర దర్బార్, టేకుమట్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యనారాయణ రావు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు  చేపట్టారు. అంకుషాపూర్ లో రోడ్డు నిర్మాణ పనులకు, రామకృష్ణాపూర్(టీ) లో గ్రావెల్ రోడ్డు మరియు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు. అనంతరం వెలిశాల లో కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనము ప్రారంభోత్సవము చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

# టేకుమట్లలో యూరియా కోసం తిప్పలు

అక్షర దర్బార్, టేకుమట్ల: మండలంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల దుకాణాల వద్ద క్యూలు కట్టి నిలబడ్డా, అవసరమైనంత యూరియా అందకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల కీలక దశలో ఎరువులు అందకపోవడంతో పంటలు ఎండిపోతాయేమో అన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. రైతులు మాట్లాడుతూ  అధికారులు సమస్యను గమనించకుండా కేవలం చూడటమే తప్ప, పరిష్కారం కోసం ముందుకు రాకపోవడం. ఇంతటి ఇబ్బందులు



పడుతున్నా ఎరువులు దొరకడం లేదు అని చెప్పడం రైతులను అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా, వెంటనే సరిపడా యూరియా రవాణా చేసి రైతుల కష్టాలు తీర్చాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.



# కల్పనకు న్యాయం చేయాలి

## బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో

అక్షర దర్బార్ నల్లబెల్లి :  నల్లబెల్లి మండల కేంద్రంలో  భారతీయ జనతా పార్టీ రోడ్డుపై ధర్నా చేశారు. నల్లబెల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి కల్పనకు న్యాయం చేయాలని బీజేపీ మండల నాయకులు తడక వినయ్ డిమాండ్ చేశారు ధర్నాలో మండల నాయకులు ప్రణయ్ సాగర్ ఆదిరెడ్డి  పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రైతాంగ పోరాట

# చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

## : ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేష్

వరంగల్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మండిపడ్డారు. మంగళవారం నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలను మభ్యపెడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామా ఆడుతున్నాయని, 42% బీసీ రిజర్వేషన్లను అమలు చేయకుండా రాజకీయ లాభాల కోసం వాయిదా వేస్తున్నాయని విమర్శించారు.

స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని రమేష్ పిలుపునిచ్చారు. ఈనెల 11న వరంగల్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే సెప్టెంబర్ 12న



తొర్రూరులో అమరజీవి మద్ది కాయల ఓంకార్ శత జయంతి రాష్ట్ర సదస్సు, 17న వరంగల్‌లో రైతాంగ పోరాట వారోత్సవ ముగింపు సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

# హరీష్ రావుపై కవిత వ్యాఖ్యలు సరికాదు

## టీహెచ్ ఆర్ సేన సోషల్ మీడియా కన్వీనర్ దాసరి రవి



అక్షర దర్బార్, పరకాల: మాజీ మంత్రి హరీశ్ రావుపై జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణలు సరికాదని టి హెచ్ ఆర్ సేన సోషల్ మీడియా కన్వీనర్ దాసరి రవి పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ తోపాటు హరీష్ రావుకు అండగా ఉంటామని చెప్పారు. కేసీఆర్ మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న హరీశ్ అన్నపై కవిత చేసిన ఆరోపణలను నిరాధారమైనవని ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే దీటుగా సమాధానం చెప్తామని హెచ్చరించారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ బైఠాయింపు

అక్షర దర్బార్, నల్లబెల్లి : తహసీల్దార్ కార్యాలయంలో మహిళా ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనకు సంబంధించి ఇప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తీవ్రంగా స్పందించారు. మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి మాట్లాడుతూ, “ఘటన జరిగిన 24 గంటలు గడిచినా ఇప్పటికీ అరెస్టులు చేయకపోవడం సిగ్గుచేటు” అని విమర్శించారు. జూనియర్ అసిస్టెంట్ కల్పనా ఎమ్మార్వో కార్యాలయంలో పురుగుల మందు తాగిన సమయంలో, అక్కడే ఉన్న ఎమ్మార్వో మరియు సిబ్బంది ఆమెను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఎమ్మార్వో నిర్లక్ష్యానికి బాధ్యత వహించాలనీ, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పిటిసి పెద్ది స్వప్న మాట్లాడుతూ, గిరిజన మహిళా ఉద్యోగిని పట్ల కాంగ్రెస్ నాయకులు అసభ్యకరంగా వ్యవహరించారని, ఆమె సూసైడ్ నోట్‌లో మాలోత్ చరణ్ సింగ్, మేడేపల్లి మాజీ ఎంపీటీసీ మాలోత్ మోహన్ పేర్లు ప్రస్తావించినప్పటికీ ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఆమె



మాట్లాడుతూ, “నల్లబెల్లి మండలంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవ్ రెడ్డి అండతో విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్మెయిల్ చేస్తున్నారు. వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి” అని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మాజీ ఎంపీపీలు ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గందె లత, శ్రీనివాస్ గుప్తా, మాజీ ఎంపీటీసీ నానబోయిన రాజారాం, మామిండ్ల మోహన్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ నేతలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

# పురుగు మందు పిచికారిలో జాగ్రత్తలు పాటించాలి



అక్షరదర్బార్,శాయంపేట : రైతులు, వ్యవసాయ కూలీలు పురుగుమందులు పిచికారీ సమయంలో తప్పనిసరిగా పి.పి.ఈ (వ్యక్తిగత రక్షణ కవచాలు) ధరించాలని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ పెద్దపల్లి రామ్మూర్తి సూచించారు. మంగళవారం ప్రగతిసింగారం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పిచికారీ సమయంలో విషపదార్థాలు శరీరంలోకి ప్రవేశించి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బీసీఐ–హెచ్&ఎమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా రైతులు, కూలీలకు పి.పి.ఈ కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ మేనేజర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ, రసాయన ఎరువులకు బదులుగా వర్మీ కంపోస్ట్, సిటీ కంపోస్ట్ వాడాలని, పత్తిని మధ్యవర్తులు లేకుండా నేరుగా జిన్నింగ్ మిల్లులకు అమ్మాలని రైతులకు సూచించారు. అదేవిధంగా స్థానిక ఎఎస్ఐ రైతులను సైబర్ మోసాలపై అప్రమత్తం చేశారు.

# కాళీ ప్రసాద్ పరామర్శ..



అక్షర దర్బార్, దామెర: దామెర మండలం కోగిల్వాయి గ్రామంలో ఇటీవల మరణించిన గడబోయిన లచ్చమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేసిన పరకాల నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పాలకుర్తి శ్రీలత, బూత్ అధ్యక్షులు చుక్క మహేందర్, పెరుగు స్పందన, నాయకులు సంగనవేన వేణు, పెరుగు కుమార్, పెరుగు రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

**- ఎమ్మెల్యే జీఎస్సార్..**



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్ళపల్లి, టేకుమట్ల, చిట్యాల మరియు గణపురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈరోజు ఒక్కరోజే సుమారు రూ.16 కోట్ల 40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలకతీతంగా అన్ని గ్రామాలను అభివృద్ధి పరచనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో సీఎం నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. నాణ్యతతో పాటు సకాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్లు, గుత్తేదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల డబ్బుతో జరుగుతున్న ప్రతి పనిలో పారదర్శకత ఉండాలని, అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తూ, ప్రతి గ్రామంలో సమగ్రాభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు. మొగుళ్ళపల్లి మండలం రంగాపురం గ్రామంలో రంగాపురం నుండి జూకల్ వరకు రూ.30 లక్షలు, ఇస్సిపేటలో ఇస్సిపేట నుండి చింతలపల్లి వయా పాత ఇస్సిపేట వరకు రూ.100 లక్షలు, ఇస్సిపేట నుండి వాగోడ్డుపల్లి వరకు రూ.120 లక్షలతో శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ రఫీ తక్కల్లపల్లి రాజు ఆకుతోట కుమారస్వామి మండ రవీందర్ ఎంపీడీవో సురేందర్ గౌడ్ ఎమ్మార్వో జాలి సునీత రెడ్డి రెవిన్యూ ఇన్స్పెక్టర్ శివ రామకృష్ణ. అధికారులు నాయకులు పాల్గొన్నారు.





# నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం : మండలంలోని వీరభద్రవరం గ్రామంలోని ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సబక లక్ష్మయ్య, బోదెబోయిన స్వరూప, కుంట గౌరమ్మ నిరుపేద కుటుంబాలను మంగళవారం జాతీయ బిసి సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచెర్ల నాగేశ్వరరావు,వెంకటాపురం మండలం కార్యదర్శి బట్ట నాగేందర్ లు పరామర్శించి 11,500 నగదుతో పాటు 75 కేజీల రైస్ బ్యాగ్ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కాగా ఆపదలో ఆర్థిక సాయం అందించినందుకు బాధిత కుటుంబాలు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యూత్ సభ్యులు సోలం సుధాకర్, సోలం ఓంపతి, బంద రాము, గగ్గురి రమేష్, పొన్నగంటి కృష్ణారావు, ధర్రాజు గురుమూర్తి,మంచర్ల వెంకటేశ్వరరావు, కుంట సందీప్ తదితరులు పాల్గొన్నారు



# నక్ష ప్రకారమే పనులు చేపట్టాలి

అక్షర దర్బార్, శాయంపేట : మైలారం గ్రామ పెద్ద చెరువు కట్ట వద్ద జరుగుతున్న బీటీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇష్టారీతిగా మార్పుతున్నారని గ్రామ నాయకులు ఆరోపించారు. మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గడిపె విజయ్‌కుమార్ మాట్లాడుతూ, రూ.1.60 కోట్లు మంజూరైనప్పటికీ పనులు సక్రమంగా పూర్తి కాలేదని, గుత్తేదారును బెదిరించడం వల్ల రోడ్డు పనులు ఆగిపోయాయని తెలిపారు. తమ స్వలాభం కోసం రోడ్డును చెరువులోకి వంకరగా మళ్లించి, దళిత గోరీలు కూల్చి భూమి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అలా కొనసాగితే మైలారం గ్రామ దళిత కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తూ, నక్ష ప్రకారమే పనులు జరగాలని, కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక రైతులు, పీఏసీఎస్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# యువకుడిపై పీడీ యాక్ట్ నమోదు

**- నిందితుడిపై 20 కేసులు**



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: 20 కేసులకు పైగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన జంగేడు గ్రామానికి చెందిన దురిశెట్టి నిరంజన్ అనే వ్యక్తిపై ఘన్పూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీహెచ్ కరుణాకర్ రావు భూపాలపల్లి ఎస్పీ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. దురిశెట్టి నిరంజన్ పై ఒక్క భూపాలపల్లి జిల్లాలోనే దాదాపు 20కి పైగా కేసులు నమోదయ్యాయని, నిందితుడు చట్ట విరుద్ధ కార్యకలాపాలలో నిమగ్నమై, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుండడంతో పలుమార్లు హెచ్చరికలు చేసినప్పటికీ అతడిలో మార్పు రాలేదని జిల్లా పోలీసులు ఆయనపై ఉన్న రికార్డులు, నేరప్రవర్తనను సమగ్రంగా పరిశీలించి, ప్రజా శాంతి పరిరక్షణ కోసం ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన్ని చర్లపల్లి జైలు లో నిర్బంధించారు. జిల్లా ప్రజలకు శాంతి, భద్రత కల్పించడం మా బాధ్యత. ఇటువంటి అలవాటు పడిన నేరస్తులపై కఠిన చర్యలు కొనసాగిస్తామని జయశంకర్ భూపాలపల్లి ఎస్పి కిరణ్ ఖరే, డి.ఎస్.పి సంపత్ రావు, ఘణపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు తెలిపారు.

# భవిష్యత్తులో మీరేం అవుతారు

- **విద్యార్థులను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్**
- **గిర్మాజీపేట ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ**

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ ఆటోనగర్ లోని గిర్మాజీపేట ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అక్షయ పాత్ర వారిచే వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులను రుచి గురించి అడిగి తెలుసుకుని, నిర్వాహకులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలు, పదాలు చదివించారు. ఆపై హైస్కూల్ తరగతులను సందర్శించి, పదవ తరగతి విద్యార్థుల తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, పాఠాలు బోధించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, వారి విషయావగాహన పరీక్షించారు. మెరుగైన బోధన అందించుటకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు చెబుతూనే.. జీవిత లక్ష్యం ఏమిటని కుశల ప్రశ్నలను సంధించి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టపడి చదవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మెరుగైన విద్య బోధించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈఓ విజయలక్ష్మి , తహసీల్దార్ ఇక్బాల్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు భోపాల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



